క్లుప్తంగా

గోరుకల్లులో 8 టీఎంసీల నీరు


గోరుకల్లు జలాశయంలో నిల్వ ఉన్న నీరు

పాణ్యం: గోరుకల్లు జలాశయంలో 8.8 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ సుభకుమార్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయిందన్నారు. ప్రస్తుతం ఎస్సార్బీసీకి 1500 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. అలాగే ఎస్సార్బీసీకి ఈనెల 14వ తేదీ వరకు నీటిని అందిస్తామని చెప్పారు. వారబందీలో పద్ధతిలో మరో వారం లేదా పది రోజుల్లో నీటిని వదులుతామన్నారు. ఎక్కడా నీరు వృథా కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

బాణసంచా అమ్మకాలకు అనుమతులు తప్పనిసరి

సి.బెళగల్: మండల పరిధిలో బాణసంచా అమ్మకాలకు అనుమతులు తప్పనిసరి అని ఎస్‌ఐ మన్మధవిజయ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాలలో బాణసంచా అమ్మకాలు చేపట్టేవారు తప్పనిసరిగా పోలీస్‌వారి అనుమతులను తీసుకోవాలని, అదేవిధంగా అగ్ని ప్రమాదాల రక్షణ పరికరాలను దుకాణాల వద్ద ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సున్నపురాయి తరలిస్తున్న లారీ సీజ్

కర్నూలు (న్యూటౌన్): డోన్ మండలం యు.కొత్తపల్లె వద్ద అక్రమంగా సున్నపురాయి తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం తెల్లవారుజామున విశ్వసనీయ సమాచారం మేరకు ఆకస్మికంగా దాడి చేసి లారీని పట్టుకున్నామన్నారు. మైనింగ్ డీడీ మాట్లాడుతూ డోన్‌కు చెందిన గౌసియా ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీ అక్రమంగా సున్నపురాయి తరలిస్తున్నట్లు విచారణలో తేలడంతో తదుపరి చర్యల నిమిత్తం జలదుర్గం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. అక్రమంగా ఎవరైనా డోలమైట్, సున్నపురాయి, వైట్‌షీల్, స్టైయిడెడ్ పౌడర్ తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలకు న్యాక్ ఏ+ గ్రేడ్


సంబరాల్లో కళాశాల చైర్మన్, కరస్పాండెంట్, అధ్యాపకులు, విద్యార్థుల బృందం

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలకు న్యాక్ ఏ+ గ్రేడ్ (4 పాయింట్లకు 3.45 పాయింట్లు) గుర్తింపు వచ్చిందని కేవీ సుబ్బారెడ్డి కళాశాలల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఫార్మసీలో న్యాక్ గుర్తింపు పొందిన మొట్టమొదటి కళాశాల మాదే కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే అటానమస్ గుర్తింపు లభించనుందన్నారు. ఈ విజయ సాధనలో భాగస్వాములైన సిబ్బందికి, విద్యార్థులకు కరస్పాండెంట్ విజయలక్ష్మి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులతో కలసి విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు.

మండల మహిళా సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక

కోడుమూరు రూరల్: ఏపీ మహిళా సమాఖ్య మండల కమిటీని మహిళా నాయకురాలు సులోచనమ్మ అధ్యక్షతన శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలిగా సువర్ణ, కార్యదర్శిగా విజయభారతి, ఉపాధ్యక్షురాళ్లుగా వెంకటేశ్వరమ్మ, సులోచనమ్మ, సహాయ కార్యదర్శులుగా రాజేశ్వరి, లక్ష్మీదేవమ్మ, కోశాధికారిగా సరోజమ్మలను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా భూలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, రసూల్, గిడ్డమ్మ, మంజుల, సుంకమ్మ, మంగమ్మ, దస్తగిరమ్మ, లక్ష్మిలను ఎన్నుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు (సిటీ) : మండల పరిధిలోని ఎల్.పేట-ఉల్చాల మధ్యలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రేమట గ్రామానికి చెందిన మేకల లక్ష్మన్న (60) కోలుకోలేక శనివారం కర్నూలు పెద్దాసుపత్రిలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట రేమట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సంపత్ కుమార్, తిరుమల్ రెడ్డి ఉన్నారు. కాగా మృతుడికి భార్య శకుంతలమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

భోగ భాగ్యాలనిచ్చే..భోగేశ్వరుడు

- దక్షిణకాశీగా వెలుగొందుతున్న భోగేశ్వర క్షేత్రం
- దుర్గాభోగేశ్వరుని దర్శనం సర్వపాపహరణం
- ఈ నెల 14 నుంచి కార్తీక మహోత్సవాలు


దుర్గాభోగేశ్వరాలయం


పూజలందుకుంటున్న భోగేశ్వరుడు


ప్రధాన కోనేరు


ఉత్సవాలకు సిద్ధంగా ఉన్న రథం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలోని ఎర్రకనుమ కొండల్లో వెలసిన భోగేశ్వరుడు భోగభాగ్యాలు ఇచ్చే దేవుడిగా ప్రసిద్ధి చెందారు. దుర్గాభోగేశ్వరస్వామి దర్శనం భక్తులకు సర్వపాపహరణం అని ప్రతీతి. దక్షిణ కాశీగా ఈ ఆలయం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. పూర్వం భోగోలు అనే గ్రామం ఉండటంతో ఈ క్షేత్రానికి భోగేశ్వరం అనే పేరు వచ్చింది.

ఆలయ విశిష్టత

బోగోలు గ్రామంలో పేద దంపతులకు అబ్బాయి, అమ్మాయి సంతానం. వారు చనిపోవడంతో చిన్నారులను సంతానములు లేని వారు వేర్వేరుగా చేరదీసి పెంచుకుంటుండేవారు. ఒకరికి ఒకరు తెలియని పరిస్థితులలో పెద్దవారైన వారిద్దరికి తెలియక వారికి వివాహం చేశారని పురాణాల కథనం. పెళ్లైన భార్యభర్తలు పడకగదిలోకి వెళ్లే ప్రయత్నంలో అదే ఇంట్లో పడుకున్న లేగ దూడ తోకను వరుడు తొక్కుతాడు. అప్పుడు దూడ మనుషుల భాషలో తన తల్లితో అమ్మ వాడు నాతోక తొక్కినాడే అంటుంది. దీనికి తల్లి వీడు సొంత చెల్లినే వివాహం చేసుకున్నాడని, చూసుకోడులే అని ఆవు అంటుంది. ఆ మాటలు విన్న వరుడు కలత చెంది విషయం తెలుసుకుని తెలియక తప్పు చేశామని వేడుకోగా.. అప్పుడు ఆవు విఖండ మహర్షి కుమారుడు ఋష్యశృంగ మహర్షి వద్దకు వెళ్లి శరుణు వేడుకోమని చెబుతుంది. వారు ఋషి వద్దకు వెళ్లగా వారికి తలంబ్రాలు, పసుపుపచ్చని వస్త్రాలు ఇస్తాడు. బ్రహ్మముడితో అన్ని క్షేత్రాలలోని కొనేరులల్లో స్నానం చేయాలని, ఎక్కడైతే మీ పసుపుతో ఉన్న వస్త్రాలు తెల్లగా మారునో అప్పుడు పాపపరిహారం అవుతుందని ఋషి చెబుతాడు. వారిద్దరూ అన్ని క్షేత్రాలు తిరిగి పండు ముసలివారు అవడం, చివరగా శ్రీదుర్గాభోగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించి ఇక్కడ ఉన్న పంచామృత కోనేరులో స్నానం చేస్తారు. అప్పుడు వస్త్రాలు పసుపు వర్ణం పోయి తెల్లగా మారతాయి. అప్పుడు పాపవిముక్తి పొందారని కథనం. దీంతో పాటు కాశీలో తప్ప మరే క్షేత్రంలో లేని కాలభైరవుడు భోగేశ్వరంలో ఉన్నందున ఈ క్షేత్రం దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచింది.

కార్తీక మహోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

కార్తీక మహోత్సవాల సందర్భంగా దుర్గాభోగేశ్వరాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ చంద్రశేఖరెడ్డి, చైర్మన్ ఐసాని సనీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 14 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు కార్తీక మాసం ఉండటంతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధానాచార్యకులు శ్యామ్ సుందర్‌శర్మ చెప్పారు. ఈ నెల 20న మొదటి సోమవారం స్వామివారికి తెల్లవారుజామునే అభిషేకాలు ప్రారంభమవుతాయన్నారు. అదే రోజు సాయంత్రం గడిగరేవుల గ్రామంలో ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం ఉంటుందన్నారు. 27న రెండవ సోమవారం ఉదయం స్వామివారి కల్యాణోత్సవం అంత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశామని చెప్పారు. డిసెంబర్ 4న మూడవ సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు గ్రామోత్సవం, 11న నాల్గవ సోమవారం భోగేశ్వరుడికి ప్రత్యేక పూజలతో పాటు ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ వివరించారు. కార్తీక మాసంలో ప్రతిసోమవారం ఆలయానికి వచ్చే భక్తుల కోసం నంద్యాల, నందికొట్కూరు డిపో నుంచి ప్రత్యేక బస్సుల నడుపుతున్నట్లు వెల్లడించారు.

అన్నదాన ఏర్పాటు

భోగేశ్వరాలాయానికి విచ్చేసే భక్తులకు కాశిరెడ్డినాయన, ఆర్యవైశ్య అన్నదాన సత్రాలలో ఉచితంగా అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాకులు తెలిపారు. మూడవ సోమవారం జంగం నాగమల్లయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తారన్నారు.

భోగేశ్వరుడిని దర్శించుకుంటే పాపాలు తొలగుతాయి



కార్తీకమాసం సందర్భంగా భోగేశ్వరుడిని, అమ్మవారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయి. ఇరవై ఏళ్లుగా స్వామికి వారికి విశేష సేవలు అందించి భక్తుల మన్ననలు పొందుతున్నాం. భోగేశ్వరుడిని దర్శించుకుని ప్రతి ఒక్కరూ స్వామివారి కృపకు పాత్రులు కావాలి. కార్తీకమాసంలో స్వామి వారిని దర్శించుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఆలయానికి వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

– శ్యాంసుందర్‌శర్మ, ఆలయ ప్రధానార్చకులు, భోగేశ్వరం

భక్తులకు అన్ని సౌకర్యాలు



కార్తీకమాసం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశాం. తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నాం.

– సునీల్‌కుమార్‌రెడ్డి, చైర్మన్, భోగేశ్వరాలయం

సంక్షేమ పథకాలతో ప్రజలందరూ సంతోషం

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం
- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్


పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ పార్టీలకతీతంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, సంక్షేమ పథకాలతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని గార్గేయపురం సచివాలయం-1, 2ల పరిధిలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, ఆ కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. అలాగే ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా కుటుంబంలో ఏవైనా సంక్షేమ పథకాలకు అర్హులు ఉన్నారా? అని వారు ఆయా కాలనీవాసులను అడిగారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వాల కంటే తాము అభివృద్ధి, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, దశబ్దాలుగా రా జకీయాల్లో ఉన్న నాయకులకు ఏ రోజు కూడా ప్ర భుత్వాలు అందించే సేవలను ప్రజల దగ్గరకే చేర్చా లని ఆలోచన చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సర్పంచ్ సోమేశ్వరమ్మ, సింగిల్‌విండో చైర్మెన్లు వినయ్ కుమార్ రెడ్డి, శేషిరెడ్డి, ఎల్ల నాగిరెడ్డి, ఎంపీటీసీ జ్యోతిలతా, విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు రవి శాస్త్రి, మాజీ వైస్ ఎంపీపీ డి.వాసు, నాయకులు సురేష్, యేసేపు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తన నివాసంలో అందజేశారు. కర్నూలు అర్బన్ 39వ వార్డు పరిధిలోని బాలాజీ నగర్‌కు చెందిన కారె సుగుణమ్మకు రూ.1.20 లక్షలు, సి.బెళగల్ గ్రామానికి చెందిన కె.సరోజమ్మకు రూ.1.30 లక్షల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలు సీఎంకు, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

టపాసులు సరసమైన ధరకు విక్రయించాలి


టపాసుల దుకాణాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు : టపాసులను సరసమైన ధరకు విక్రయించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బాణసంచా (టపాసుల) 8 దుకాణలను ఏర్పాటు చేశారు. దుకాణలను రిబ్బన్ కట్ చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందుగా ప్రజలందరి దిపావళి శుభాకాంక్షలు తెలిపారు. అందరి ఇళ్లలో చీకట్లు తొలగి వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన దుకాణలను ఆయా చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి, శ్రీనివాసులు, అరుణ, నాయకులు వీరయ్య, శ్రీనివాసులు యాదవ్, బాలచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీలో శివ భక్తుడు గల్లంతు

కర్నూలు: జొహరాపురం గ్రామానికి చెందిన రామకృష్ణ (40) కేసీ కెనాల్‌లో పడి గల్లంతయ్యాడు. ఈయన పెయింటర్ పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల శివమాల ధరించాడు. అయ్యప్ప స్వామి గుడి వెనుక శనివారం తెల్లవారుజామున స్నానానికి వెళ్లి మెట్లపై అదుపు తప్పి నీళ్లలో పడి గల్లంతయ్యాడు. ఆచూకీ కోసం స్థానికులతో పాటు కుటుంబ సభ్యులు కూడా దాదాపు కిలోమీటర్ పొడవునా గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదని తెలిసింది.

కేవీ సుబ్బారెడ్డిలో ఘనంగా ఫ్రెషర్స్ డే


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ఐఐఐటీడీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ సోమయాజులు, యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ రామసుబ్బారెడ్డి, కళాశాలల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఉండాలన్నారు. విద్యార్థి దశలో క్రమ శిక్షణ ఎంతో అవసరమని, క్రమ శిక్షణతోనే ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ విజయలక్ష్మి, కార్పొరేటర్ కైపా పద్మాలతారెడ్డి, ప్రిన్సిపాల్ కన్నా కుమార్ పాల్గొన్నారు.

మౌలానా ఆజాద్ సేవలు ఎనలేనివి

కర్నూలు(రాజ్‌విహార్):దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలాన అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధి, మైనారిటీల సంక్షేమానికి చేసిన కృషి ఎనలేనిదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. మౌలాన ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీవ విద్యా, మైనారిటీ దినోత్సవ కార్యక్రమం స్థానిక బిర్లాగేట్ వద్ద ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆజాద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రిగా ఆజాద్ అనేక సంస్కరణలు తీసుకొచ్చి విద్యాభివృద్ధికి పాటుపడ్డారని చెప్పారు. ఆయ న ఆశయ సాధనకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగా పేదలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. గతంలో అగ్రవర్ణాలకు పరిమితమైన చదువు ఇప్పుడు సా మాన్యులకూ అందుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, పార్టీ నాయకులు మద్దయ్య, ధనుంజయ ఆచారి, కార్పొరేటర్ శ్వేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్టు


దొంగల ముఠాల నుంచి రికవరీ చేసిన వాహనాలు, వైర్లు, నగలు, నగదు వివరాలను వెల్లడిస్తున్న సీఐ

కర్నూలు : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గొర్రెలు, కరెంటు తీగలు, ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన దొంగల ముఠాలను తాలూకా పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. పక్కా సమాచారం మేరకు గుంతకల్లుకు చెందిన రాఘవయ్య, కర్నూలు మమతా నగర్‌కు చెందిన ఎరుకలి సురేష్, డోన్ మండలం కొత్తబురుజు గ్రామానికి చెందిన రంగనాయకులు, కర్నూలు ప్రకాష్‌నగర్‌కు చెందిన బోయ విజయ్, నరసింహారెడ్డి నగర్‌కు చెందిన ఎరుకలి మధు, అశోక్ నగర్‌కు చెందిన పేరపోగు రాకేష్, దేవనకొండకు చెందిన ఎరుకలి సురేష్, సుధాకర్, డాన్ శ్రీను, కడప రామయ్య తదితరులను అదుపులోకి తీసుకుని విచారించగా వారి నేరాల చిట్టా బయటపడింది. కర్నూలు మండలం రుద్రవరం గ్రామ పొలిమేరలోని కొండ వద్ద గొర్రెల దొంగతనం, అలాగే కర్నూలు బాలాజీ నగర్, వెంగన్నబావి సమీపంలోని బాలాజీ విల్లాస్‌లోని ఓ ఇంట్లో దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. అలాగే జి.శింగవరం గ్రామంలో మోటర్ సైకిల్, నిడ్జూరు, ఉలిందకొండ, సూదేపల్లి, బ్రాహ్మణదొడ్డి, సంగాల, కడప జిల్లా ముద్దనూరు మండలం చెన్నంపల్లి గ్రామాల్లో మొత్తం 111 గొర్రెలు దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి రూ.21 లక్షలు విలువ చేసే గొర్రెలు, మోటర్ సైకిళ్లు, బంగారు, వెండి ఆభరణాలు, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ శ్రీరాం తెలిపారు. అలాగే కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామం వద్ద ఎన్‌హెచ్-44 నుంచి నంద్యాలకు వెళ్లే హైవే రింగ్ రోడ్డు మధ్యలో గల టిడ్కో ఇళ్లల్లో కరెంటు వైర్లు దొంగతనం చేసిన మరో 16 మంది ముఠా సభ్యులు నంద్యాల జిల్లాకు చెందిన పసువుల శ్రీకాంత్, నరసింహుడు, బోయ శ్రీనివాసులు, మధుబాబు, బాలకొండయ్య, పసుపుల నాగేంద్ర, పుల్లయ్య, ఎర్రపాపన్న, పోలూరు మల్లికార్జున, షేక్ ఫరూక్ బాషా, నాగశేషులు, ప్రసన్న కుమార్, చింతమాను నాగరాజు, బోయ పెద్ద ఎల్లయ్య, వడ్డె మదనగోపాల్, షేక్ బాబా హుసేన్ తదితరులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి రూ.19,61,517 విలువ చేసే 315 కరెంటు వైర్ బండిల్స్, నేరానికి ఉపయోగించిన తుఫాన్ వాహనం, రెండు మోటర్‌సైకిళ్లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. రెండు ముఠాల నుంచి రూ.61,61,517 విలువ చేసే సొమ్ములు, వాహనాలు, గొర్రెలను రికవరీ చేసినట్లు సీఐ శ్రీరాం తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం


జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న శివరాంగౌడ్

కర్నూలు(టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలోని వ్యాయామ శాలలో శనివారం జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శివరాం గౌడ్ ప్రారంభించి మాట్లాడారు. వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో మంచి అవకాశాలు ఉన్నాయని, జిల్లా స్థాయిలో ఎంపికయిన క్రీడాకారులు ఈనెల 16 నుండి 18వతేదీ వరకు శ్రీకాకుళం పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పాపా, సభ్యులు నాగరాజు, కోచ్ బాషా, జలీల్ పాల్గొన్నారు.


బస్తిపాడులో కళకళలాడుతున్న జొన్న పైరు

పంటలు కళకళ


చిన్నటేకూరులో పచ్చగా ఉన్న ఉల్లి పంట

నాలుగు రోజుల క్రితం కురుసిన వర్షం వల్ల మండలంలో సాగు చేసిన వివిధ పంటలు కళకళలాడుతున్నాయి. నెల రోజులుగా వరుణుడు మోహం చాటేయడం వల్ల పంటలు ఎండిపోతాయేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కురిసిన వర్షం పంటలకు జీవం పోసినట్లయింది. – కల్లూరు


లక్ష్మీపురంలో పూత వచ్చిన కంది పైరు